

"నానయ్యాలే సెప్పినాను. ప వినుకున్నావుకాదు." లక్ష్మంనాయుడు నిష్ఠురంగా అన్నాడు. రామినాయుడు మాటాడలేదు. "ఏటి సల్ల కూరుకోడమేనా?" రెట్టించాడు లక్ష్మంనాయుడు.

చెవిని కాడుంది. తెల్ల పంచమీద చేతులు, జేబు ఉన్న బనీ నుంది. నెరిసిన బొద్దుమీసా లున్నాయి. లంటుకత్తె రేయించిన తలుంది. అన్నిటికన్నా ముఖ్యం ముఖంలో సూటైన ముక్కుంది. ముక్కుమీద కోప ముంది. గొంతుకిల్లా కూర్చున్న లక్ష్మంనాయుడు చేతిలో చేపాటి కర్రా ఉంది.

"ఏట్రయ్యా! ఆకాడ కీ సవురమంతా నీ సొమ్మే అంవట్టు వదుర్రా" వన్నాడు చలమయ్య. చలమయ్య సన్నటి మనిషి. లోతుకుపోయిన దవడలు. మనుష్యుల్ని సందేహంగా చూసే కళ్లు. వ్యవసాయం మానేసి బియ్యం వర్తకం చేస్తున్నాడు. చెయ్యి ముట్టు సరసమంటే కొంచెం జంకుతాడు.

లక్ష్మంనాయుడు చలమయ్యని మింగేసేలా చూశాడు. కాని మాట్లాడలేదు. నాగలిలో నేలని దున్ని పంటలు పండించని

కాని, నా దొక్క మా టున్నాది. ఊరు నిమ్మళంగా ఉండడం, మాలమాదిగల మొదలు పంతుళ్ళ దాకా అంతా ఒకే మాటమీా దుండడం, కష్టాలకోర్చి ఊరిని బాగుచేస్తుండడం కొందరి కిష్టం లేదు. వాళ్ళెవరో మీాకు తెలుసు. నేను చెప్పను. కాని నలుగురు తన్నుకుంటే గాని, నాలు గన్యాయాలు జరుగుతుంటే గాని వాళ్ళ పొట్ట నిండదు. గోతి దగ్గర నక్కల్లాగ వాళ్ళు సమయం కోసం కాచుకుని ఉన్నారు. ఈ రోజు ఏ గలాటా జరిగినా అదీ వేళతో ఆగిపోదు కదా! ఇన్నాళ్ళ మన ప్రయత్నాల్ని బూడిదలో పన్నీరులా చేస్తుంది. ఆపైన మీా ఇష్టం. గురువుగా రొచ్చేదాకా ఆగుతారో, స్వతంత్రించి మీారు చెయ్యదలుచుకున్నది చేస్తారో!"

శివున్నాయుడు స్తంభంమీాద చెయ్యేశాడు లేవడానికి. "ఓరయ్యో! రామినాయుడు! నా కింతగా ఉన్నాది. ఇన్ని మాట లెక్కడ నేర్చినావో, ఎప్పుడు నేర్చినావో నా నెరగను. కాని 'అల్తొచ్చిందాక అమాస ఆగ'దంటారు. ఓ పాలి ఆలోసించు. నీ పాటి యవ్వారం నానూ సెయ్యగల్ను. కాని నిలకడమీాద సద్దిద్దామంటే కుదిరేది కా దిది. ఇయ్యాల నందెమ్మని అనిపే తీరాల. అనిపేముందల ఊరంతా తిప్పే తీరాల. ఆ తిప్పడం మనీది తోటే మొదలవ్వాల. ఇందు కే నంజకొడుకైనా అడ్డం సెబితే మనీదిలోకి ఊరేగింపెలా గొస్తాదో నాను సూత్తాను.

ఇంక ఊర్లో తగూలంటావా! అవొక నాటితో తీరేవి కావు. ఇయ్యాల కాపోతే మరో పొద్దు. అయినా, ఈ ఏడెనిమిదేళ్ళ బట్టి ఏ తగూ ల్లేవంటే, ఎల్లకాల మిలా గుండిపోవాల నుందేటి? ఓ మడిసెక్క తగువో, మరోటైతే నాను పట్టు బట్టను. ఇది తల్లి మానచ్చిమికి సంబందించిందిరా, అయ్యా! నాను పల్లకుండలేను."

రామినాయుడు మాట్లాడలేదు. అతను చూస్తుండగానే శివున్నాయుడు, లక్ష్మంనాయుడు లేచి పైగుడ్డలు దులిపి భుజాన వేసుకుని అతని ఇంటి మెట్లు దిగి వెళ్ళిపోయారు. అరుగు మీాద ఆలోచిస్తూ కూర్చున్న రామినాయుడు ఎంతసేపటికీ నోరు మెదపక పోయేసరికి చలమయ్య అరుగు దిగి వెళ్ళిపోయాడు.

* * *

"ఊరు మొత్తానికి నందెమ్మని తేనేదు. పిల్లోడికి వచ్చే పేనం, పోయే పేనంనా గున్నపుడు నాను తల్లికి మొక్కినా. 'తల్లే! తల్లి! నందెమ్మ తల్లి! నా బొట్టెడు బతికి బట్ట కట్టేటట్టు సెయ్యి. సేత్తినా "గంయిరీ పున్నం" నాడు తెచ్చి నా ఇంట్లుంచు కుంటాను. ఎప్పట్నాగ నాగుల్సవితినాడు నా ఇంట్నుంచి బయల్దేరి, ఈ ఊరంతా తిప్పి, ఆ ఎనక ఊరంతా తిప్పి అనుపుతా' ననుకున్నాను. పిల్లోడు బతికితే మొక్కు సెల్లించొద్దా? ఇందు కెవ రడ్డు సెప్పినా నా నెక్కసెయ్యను. ఎప్పట్నాగ రాంబజన కాడవాక, నందెమ్మని నా ఇంటుంచి నప్పుడు నేని అబ్బెంతరాలు ఊరేగింపు కేల రావాల?" దాలినాయుడు అరుగు మీాద కూర్చుని అంటున్నాడు.

అప్పటికే తర్జన భర్జనలు జరిగాయి. కొంద రటన్నారు. కొంద రిటన్నారు. మరికొందరు 'ఏంకి గురువుగా రూరో నేరు కదా!' అని నిట్టూర్చారు. ఆఖరికి దాల్నాయుడు — "మొక్కిన ఇదంగా సెయ్యకపోతే ముప్పు రాదా!" అన్నప్పుడు అన్ని వాదాలూ ఆగిపోయాయి.

దాలినాయుడు అరుగుమీాద నుంచి లేచాడు. కండ లుబ్బిన చేతులూ, పిక్కల్లాటి కాళ్ళూ విదిలించాడు. రొయ్య మీాసాలమీాద చెయ్యేసి దువ్వాడు. మధ్య పాపిడి తీసి వెనక ముడి చుట్టబడ్డ జుత్తు ముడి విప్పి ఝాడించి, "నే తానం సేసొత్తా. తయార్కండెహె" అన్నాడు. సాయంకాలం నీడలు పొడుగవుతున్నాయి.

తయారైంది ఊరంతా. ఊరంతా ఎంత? రమారమి పన్నెండు వందల గడప. అయిదారు వేల జనాభా. కాని పొరుగూర్లనుంచి సంబరాలు చూడ్డాని


# దోమల బాధ ఇక లేదాయి! హాయి, హాయి!

దోమలను దూరం చేసే ఎంతో శక్తివంతమైన లోషన్

# లినెట్

- ఒక సారి పులుము కుంటే ఎన్నో గంటల పాటు దోమలనూ, ఇతర కీటకములనూ దూరంగా అవుతుంది.
- వెంటనే కీటకములను దూరం చేస్తుంది.
- విషపదార్థము కాదు
- హాని చేయదు.
- సున్నితమైన శరీరానికి కూడా దురదను పుట్టించదు.
- దుస్తులకు మరకలు పడవు
- చక్కటి సువాసన.

అన్ని చోట్లా దొరుకుతుంది.



కొచ్చిన జనంతో ఊరు రెండింతలై సందడిగా ఉంది.

పిరికి గుండెవాళ్ళు, దౌర్జన్యం నిరోధించలేకపోయినా సహించలేని వాళ్ళు తలుపులు వేసుకుని ఇళ్ళలో కూర్చున్నారు. ఊర్లో మిగతా జనమంతా తయారయ్యారు. రోకళ్ళు, కారంగుండలు ఆడవాళ్ళ చేతుల్లో—బల్లేలు, కొడవళ్ళు, బాణాకర్రలు మగవాళ్ళ చేతుల్లో.

దేవుడు తయారయ్యాడు. నందెమ్మ ఊరేగింపు దాలినాయుడింటి ముందునుంచి ప్రారంభమైంది.

ఇంటిముందు గూడుబండి ఉంచారు. దాని తడిక గూడు తీసి వెదురుకి ఎర్రటి చీరలు గూడులా చుట్టారు. బండి మధ్యలో మట్టి నందీశ్వరుడి నమర్చారు. నంది మూపుపై చెక్కపీట ఉంచారు. పీటమీద నెత్తిమీద గంగతో పరమశివుడు పక్కన పార్వతితో సహా కూర్చున్నాడు. వెంతనే కొంచెం దిగువన గోలెంలో అమర్చిన వరివెన్నుల దుబ్బుంది. అదే 'గవిరెమ్మ'న్నా, 'నందెమ్మ'న్నా.

బండిలో దాల్నాయుడు బావమరిది వెంకటేశు కూర్చున్నాడు. అరటిపళ్ళు, ఇతర నైవేద్యాలు పుచ్చుకుని ప్రసాదాలు పంచుతున్నాడు. విగ్రహాల ముందు మట్టి ప్రమిదలలో దీపాలు వెలుగుతున్నాయి.

ఊరేగింపు ముందు సన్నాయి మేళం ఉంది. ఆ వెనకే శీనయ్య చెవులకి చేగోడీలు రింగుల్లా తగిలించుకుని, మెడలో జంతికలతో గుచ్చిన హారం వేసుకుని, ముఖానికి నీలంసిరా పులుముకుని, నెత్తిన పింఛంలా తాడు కట్టి వేపరెమ్మ ఉంచుకుని, చిన్న కర్ర వేణువులా ఊదుతూ జనాన్ని నవ్విస్తున్నాడు. ఆ వెనక గొల్ల గౌరీశం జట్టు తప్పెటగుళ్ళ వాయిస్తున్నారు. చివర్న కుర్రాళ్ళు కొందరు చేరి, ఎర్రగుడ్డలు నడుముకి బిగించి కోలాటం ప్రదర్శిస్తున్నారు.

అయితే, ఎవరి మనసులూ ఆనందంగా లేవు. ప్రతివారిలోనూ ఉత్కంఠ ప్రబలుతూ ఉంది. శీనయ్య చర్యలు నవ్వు పుట్టించడం లేదు. శీనయ్యకే గుండె దడదడలాడుతున్నది.

బోను వీధి మలుపు తిరిగి పాతిక గజాలు నడిచి జంక్షన్ కొచ్చింది ఊరేగింపు. ఆ పల్లెటూరులో అదే నాలుగు వీథుల కూడలి. బోనువీధి, బజారు వీధి, పెద్దవీధి, కొత్తవీధి కలిసే దక్కడే! అక్కడే ఉంది రామభజన. లోపల దేవుడు బొమ్మ లేదుగాని, దీపాల చెట్టుంది. ఆ ఇత్తడి ప్రమిదల్లో నూనె పోసి దీపాలు వెలిగిస్తారు. అక్కడే శనివారం రాత్రుళ్ళు భజనలు జరుగుతాయి.

నందెమ్మని గౌరీపున్నం నాటినుంచి నాగుల చవితి వరకు అక్కడే ఉంచి, అక్కడి నుంచి తొలుత పెద్దవీథికి నందెమ్మని తీసుకెళ్ళడం జరగలేదనే గొడవంతా.

ఇరు పక్కాలవారు ముఖాముఖిగా వచ్చారు. కేకలు, అరుపులు. "ఈ ఈడమ్మట నందెమ్మని తీసుకెళ్ళాని కీల్లేదు." "ఏళ్ళేదో మావూ సూత్తాం." "ఇయ్యాల అటో ఇటో తేలిపోవాల." "నాయాల. . . ఒళ్ళు పొగరెక్కి. . ." "నేదురయ్యా! ఓ పాలి మన తడాక సూపాల్సిందే." తోసుకు వస్తున్నారు జనం. గాలిలో లేచిన కర్రలు నెత్తుల మీద వాలడాని కట్టే దూరం లేదు.

తప్పెటగుళ్ళు, కోలాటం పెద్దవీథి మలుపు వద్దే ఆగిపోయాయి. శీనయ్య జాడే లేదు.

అక్కడ చేరిన మనుష్యుల ముఖాలు కోపంతో జేవురించి ఉన్నాయి. ప్రేమించడం మరిచిపోయి, ద్వేషించడం, పగ తీర్చుకోవడం ప్రధానం కావడంతో వికృతంగా మారిపోయాయి.

అదొక తరంగం. వెల్లువ. నరాల్లో నెత్తురు వేగంగా పారి, ఉద్రేకంతో ఒళ్ళు వెచ్చనై, కళ్ళలో ఎర్రని జీరలు పాకి, తన ఉనికినీ, తపననీ, ప్రేమనీ, సంస్కారాన్నీ మరిచిపోయి, అహంభావం ఒక్కటే మేల్కొని, కోపం ఒక్కటే రాజుకుని, అమాయకమైన వేళ్ళు, అందమైన అరిచేతులు రూపు మారి, వేళ్ళు పాము పిల్లలై, అరిచేతులు పడగలై, మనిషి పశువై తన్ను తాను, చరిత్రనీ, సంస్కృతినీ వదిలిపెట్టి, తానొక్క భావమై, తానొక్క ద్వేషమై, ఉప్పెనై ముంచెత్తెయ్యాలని లేచిన తరంగం.

గంగ, గౌరి, పరమేశ్వరుడు, నంది —అందరూ మూగబోయారు. అరుగుల మీదా, మిద్దెలమీదా, కొట్టమీదా, ఇండ్లకప్పులమీదా నిలుచున్న జనం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

హఠాత్తుగా బజారువీథిలో చేరి ఆయుధాలతో ముందుకు వస్తున్న జనం నిశ్శబ్దమైంది. ఏరు రెండు పాయలుగా చీలి దారిచ్చినట్టు పక్కలకు తొలగిన మనుష్యుల మధ్యగా ముతక ఖద్దరు లాల్చీ, పంచె ధరించి, చేతిలో గాంధీగారి బొమ్మున్న ఖద్దరుసంచీ పట్టుకుని, మాసిన గడ్డం, దువ్వని జుత్తూ కలిగి, ప్రయాణపు అలసట వలన నలిగిన మనిషి రావడం కనిపించింది. ఆ వెనకే రామినాయుడూను.

"గురువుగారు!" "గురువుగారు!"

ఆనందం. ఆశ్చర్యం.

ఆ నల్లని భారీమనిషి ఎటూ చూస్తున్నట్టు లేదు. ఒక స్వప్నం. ఒక సౌధం. కూలిపోబోతున్న పేకమేడ. పేకమేడేనా? ఎండలో, వానలో శ్రమించి, కుటుంబానికి దూరమై, ఒంటరై పని చేసి నిర్మిస్తున్న సమాజ సౌధానికి పునాది లేనేలేదా?

ఉచితంగా ఎకరాల స్థలం విరాళమిచ్చిన జనం, చేతనైనంత ధనసహాయం, శ్రమదానం చేసి పాఠశాల, వైద్యశాల మొదలైనవి సాధించిన జనం, మంచితో మనిషిని మార్చవచ్చని నిరూపించుకున్న జనం...ఇంతలో, ఇన్నాళ్ళుగా పెంచుకుంటున్న విలువల్ని మరిచిపోయి, ఒక ఆదిమ జాతిలా ప్రవర్తించడం నిజంలా కనపడడం లేదు. పీడ కలలా ఉంది.

"బాబో! బాబు! నీకు తెల్దు. నువ్వడ్డురాకు. ఇయ్యాల అదేటో తేలిపోవాల." "బాబాల కంత మోజే అయితే తెలనీ సూత్తాం. ఏ ఊర్నుంచో వచ్చావు. ఏదో రునమున్న ట్టిన్నాళ్ళు మమ్మల్ని తిరిపి దిద్దావు. నీ మా టియ్యాల ఇనే దని బాదొద్దు. బాబు, నువ్వు తప్పుకో." "చూస్తారేటెహె?" "ఎట్టా, గురూగారు కదలందే!" "అంత తొందరేటే."

నిజమే. కల కాదు. ఏమి చెప్పి లాభం లేదు. ఇక్కడ మనుష్యుల్లేరు. వినిపించుకోరు. ఒక్క ఆవేశమే అనేక రూపాలు దాల్చి ఈ జనమై తన ముందుంది. గాలిలోకి లేచిన కర్రలు. ఎత్తి పట్టుకున్న రోకళ్ళు, బల్లేలు. గాలిలో తేలి కళ్ళలో పడడానికి సిద్ధంగా ఉన్న కారంగుండలు. ఇది మాటలకు తావు కాదు. వేళా కాదు.

నాలుగు పక్కలా తన చుట్టూ నిండి, గాలిని కాటేసి పాము కొట్టిన బుసలా ఊపిరి తీస్తూ విడుస్తున్న ఊరివాళ్ళందరినీ పరికించి, గురువుగారు మాట్లాడబోతే గాద్గద్యంవల్లో, నిద్రలేమివల్లో గొంతు భారంగా ఉండి ఈ రెండు వాక్యాలే వెలువడ్డాయి:


"ఈవేళ అటో, ఇటో తేల్చుకోవాలని ఉంటే కానియ్యండి. కాని, ముందు దెబ్బ నా మీదే పడాలి."

శివున్నాయుడటు చూశాడు. దాలినాయుడూ అటే చూశాడు. అందరూ అటే చూస్తున్నారు. ఆ చూపులకి మధ్యన నిలుచున్న 'గురువుగారు' నల్లని రాతి విగ్రహంలాగ కనిపించారు. గుంపు గుంపంతా ఒకటే ఆలోచన వ్యాపించింది. పరాయి ఊరువాడు ఈ ఊరొచ్చి, ఈ గ్రామం ప్రశాంతంగా ఉండి, ప్రజ అన్నదమ్ముల్లా మెలగాలని ఇంత త్యాగాని కొడిగడితే, ఆ ఊరికి చెంది, ఆ గడ్డ

కరుణామూర్తి జననం

మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు - 2)






# తిమింగిలం (బ్లూవేల్)

ప్రపంచం మొత్తంమీద జలచరాల్లో నైతేనేమి, భూచరాల్లో నైతేనేమి బ్లూవేల్ ( తిమింగిలం ) అంతటి పెద్ద జంతువు, అందునా ఉపయోగకరమైనది మరొకటి లేదు. ఇది ఎంత పెద్దదీ అంటే, దీని బరువు మాట ముప్ఫయి టన్నులవరకూ ఉంటుందట. పొడవు నూరు అడుగులు. దీని గుండె పెద్ద ఎద్దు అంత పరిమాణం కలిగి ఉంటుందట. దీని నాలుక తూకం ఏనుగు తూకానికి సమానంగా ఉంటుందట. ( బాగా పెద్ద ఏనుగు అయిదు టన్నులు తూగుతుంది. ) ఇక ఇది ఎనిమిది వందల సంవత్సరాలు బ్రతుకుతుందట.

ఉపయోగాలంటారా? బ్లూవేల్ ఇరవై టన్నుల వరకూ చమురు ఇవ్వగలదు. ఈ చమురు సబ్బుల తయారీలోను, ఇంకా వంటనూనెలు, మలాములు తయారు చేయడంలోదు ఉపయోగిస్తారు. దీని ఎముకలు ఎరువులుగాను, నరాలు టెన్నీసు రాకెట్లు అల్లకానికి — ఇంకా ఆపరేషన్ అయాక శరీర భాగాలు కుట్టడానికిగాను ఉపయోగిస్తారు. ఇంక దీని శరీరంలో లభించే జిగురు లాంటి పదార్థంలోనుండి ఫోటోగ్రాఫిక్ ఫిల్ము తయారు చేయడానికి, కొన్ని రకాల తీపి పదార్థాల తయారీకి, జెల్లీల తయారీకి ఉపయోగిస్తారట. ఇంకను దీనిని అలంకరణ సామగ్రి తయారు చేయడంలోను, బటన్సు, బూటు పాలిష్‌లు, రంగులు చేయడంలోను ఉపయోగిస్తారు. ఈ బ్లూవేల్ శరీర గ్రంథులలోని రసాలతో అనేకమైన మందులు తయారు చేస్తారు. యుద్ధ సమయంలో బ్రిటిషు సైనికులు ఈ బ్లూవేల్ మాంసం ఎక్కువగా భుజించేవారట.

మొత్తంమీద తిమింగిలాలు నలభై రకాలు ఉన్నాయట. వీనిలో కొన్నింటికి పళ్ళు ఉంటాయి. మరికొన్ని రకాలకు పళ్ళు ఉండవు. ఇవి నీళ్లలో ఈదులాడుతూ, ఒక విధమైన శబ్దం చేస్తాయట. ఆ శబ్దం ద్వారా ఉత్పన్నమయే ప్రతిధ్వని సహాయంతో ఆహారాన్ని చేజిక్కించుకొంటాయి. వేటసమయంలో దేనికైనా దెబ్బ తగిలితే, అది సహాయం కొరకు పెద్దగా కేకలు వేస్తుందట. ఆ కేక విని, కొన్ని మైళ్ల దూరంనుండీ తిమింగిలాలు వస్తాయట. చిన్న చిన్న తిమింగిలం పిల్లలు ఆపదలో చిక్కుకుని వేసిన కేకకు కొన్ని ఆడ తిమింగిలాలు ఒకేమారు గుంపుగా వచ్చి చేరతాయట. ఆ సమయంలో సముద్రపు అలలు ఎగిరెగిరి పడుతూ, పెద్ద తుఫాను వచ్చినట్లే ఉంటుందట. తల్లి తిమింగిలం గాయపడిన బిడ్డను నోట కరుచుకుని సురక్షిత స్థలానికి చేరుస్తుందట.

తిమింగిలాల వేటలో వేటగాళ్ళు జంటను చూడగానే ముందు ఆడ తిమింగిలాన్ని చంప ప్రయత్నిస్తారట. కారణం — మగ తిమింగిలం, ఆడ తిమింగిలాన్ని విడిచిపెట్టి తప్పించుకొని వెళ్లదట. అలా ఒకే మారు రెండూ చిక్కుతాయి. కొన్ని సమయాలలో తమ దగ్గర ఉన్న పిల్ల తిమింగిలాన్ని కేకలు పెట్టేలా చేసి, ఆ కేకతో ఆడ తిమింగిలాలను ఆకర్షించి పట్టుకొంటారట. చిక్కిన వెంటనే తమ దగ్గర ఉన్న బల్లేల వంటి ఆయుధాలతో ఊపిరితిత్తులలో అదే పనిగా కొన్ని గంటలు పొడిచాక గాని, అవి మరణించవు. కొండలా ఉన్న ఆ శరీరాన్ని ఒడ్డుకు తీసుకురావడంలో శ్రమపడక, వారు తమ వెంట పెద్ద ఫాక్టరీ ఉన్న పడవనే తీసుకు వెళతారట.

ఇలా ప్రతి దేశం తిమింగిలం వేట సాగిస్తే, ఇక రాబోయే తరాలు తిమింగిలాన్ని ఏ పటంలోనో, లేక దాని అస్థిపంజరాన్ని ఏ ప్రదర్శనలోనో చూచి, "ఓహో" అనుకొనవలసిందే. అందుకే కొన్ని పెద్ద పెద్ద దేశాలు కలిపి ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసి తిమింగిలాల వేటను చాలావరకు పరిమితం చేశాయి. ★

సేకరణ:

**శ్రీమతి సెంటీనా సరోజిని**

---

మీద పుట్టి, పెరిగి, అక్కడే మరణించవలసిన వాళ్లం ఒక చిన్న విషయాన్ని గురించి తలలు బ్రద్దలు చేసుకునేందుకు సిద్ధపడడం ఎంత అవివేకం! అక్కడ నిలుచున్న గురువుగా రొక వ్యక్తిలాకాక, అందరిలో ఉన్న సహజ ప్రేమాభిమానాలకు చిహ్నంగా కనపడ్డా రందరికీ.

ఒక మెరుపు మెరిసినట్టయింది. పాలపొంగు మీద నీళ్ళు చిలకరించినట్టయింది. తరంపంలా లేచిన ద్వేషం, ఒడ్డుకు తగిలి భగ్నమైన సముద్ర కెరటంలా వెనక్కు పోయింది. యుద్ధం చెయ్యకుండానే వీరుడికి జయించిన గర్వం కలిగినట్టయింది. ఈ లోకంలో ఎవర్నయినా జయించవచ్చు. ఎవర్ని వారు జయించడమే దుర్లభం. అందువలన కలిగే తృప్తి అనితరసాధ్యం.

"ఓరి దద్దా! నాను తొందరపడిపోనాను. నీ ఇట్టు మేనాగుం టలా క్కాని. ఎనక టూసెల్లు మరసిపో" అన్నాడు దాలినాయుడు.

"అవేం మాట ద్రయ్యా! ఊరికెళ్ళ ముసిలోన్ని నానే రామినాయుడు దురితం కూడదంటే ఆలకించనేదు" అన్నాడు శివున్నాయుడు.

"ఊఁ పదండి, పదండి. నందెమ్మ తల్లి నిల్చుండిపోనాది. బండి తోలం డెహె!"

మువ్వలు చప్పుడు చేస్తూ ఎడ్లు కదిలాయి. తప్పెటగుళ్ళు మళ్లీ మోగాయి. కోలాటం మొదలైంది మళ్లీ. ఎక్కడున్నాడో శీనయ్య మళ్లీ జనాన్ని నవ్విస్తున్నాడు.

పోరాటానికి సమాయత్తమై రెండుగా చీలిన ఊరు, నందెమ్మ ఊరేగింపు వెనక ఒకటై నిలిచింది. నవ్వే పాపాయిలాగా ఊరు కళకళలాడింది. ★